క్లుప్తంగా

మంత్రి కాకాణి ఆర్థిక సాయం



వెంకటాచలం: మండలంలోని కసుపూరుకు చెందిన చినపెంచలయ్య కుటుంబానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం సాయంత్రం కసుపూరుకు వచ్చి అగ్నిప్రమాదంలో కాలిపోయిన చినపెంచలయ్య పూరింటిని పరిశీలించారు. బాధిత కుటుంబానికి బియ్యం, దుస్తులతో పాటు కొంత నగదు అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, సర్పంచ్ నాటకం శ్రీనివాసులు, శిఖామణి, తదితరులు ఉన్నారు.

నేడు పారువేట ఉత్సవం

పొదలకూరు: పట్టణంలోని రామమందిరంలో జరుగుతున్న శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా శనివారం పారువేట ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు సహస్ర నామార్చన, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం పారువేట ఉత్సవం, గ్రామోత్సవం, పాట కచేరి ఉంటుందని వివరించారు.

నేత్రపర్వంగా చక్రస్నానం



కోదండరాముడ్ని చక్రస్నానానికి తరలిస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చక్రస్నానాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత తిరుచ్చి, అలకలతోపు ఉత్సవాలను నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా చక్రస్నానం, తీర్థవాది నిర్వహించారు. రాత్రికి ధ్వజావరోహణం చేశారు. ఆలయ చైర్మన్ దొడ్ల మురళీకృష్ణారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై వరదరాజస్వామి

జొన్నవాడలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అశ్వ వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ధ్వజావరోహణం చేశారు. ఆలయ చైర్మన్ పిళ్లెళ్ల ప్రేమసాగర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పురమందిర వ్యవస్థాపక దినోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిర 108వ సంస్థాపక దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నామని టౌన్‌హాల్ ట్రస్ట్ బోర్డు సెక్రటరీ జేఎస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలార్క శిష్య బృందంతో సంగీత విభావరి, గురుకృప కళాక్షేత్ర సురభి గాయత్రి శిష్య బృందంతో శాస్త్రీయ సంగీత నృత్య విభావరిని సాయంత్రం ఆరు నుంచి నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

కంటెంట్ ఫిల్మ్‌కు కళాకారులకు ఆహ్వానం

నెల్లూరు(బృందావనం): డీఎస్ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో నిర్మించనున్న కంటెంట్ ఫిల్మ్‌లో నటించేందుకు వర్ధమాన కళాకారులను ఆహ్వానిస్తున్నామని సంస్థ అధినేత బాలాజీశెట్టి పేర్కొన్నారు. సుబేదారుపేటలోని సంస్థ కార్యాలయంలో బ్రోచర్లను శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. యాక్టింగ్, డ్యాన్సింగ్, సింగింగ్, ఎడిటింగ్, తదితర అంశాలతో ఏదైనా కళను ప్రదర్శిస్తూ మూడు నిమిషాల నిడివిలో చిత్రించిన వీడియోను 63006 86067 నంబర్‌కు ఈ నెల 15లోపు పంపాలని కోరారు. కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వేణుగోపాలుడి రథోత్సవం



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని నేత్రపర్వంగా శుక్రవారం నిర్వహించారు. ఉభయదేవేరులతో సర్వాలంకారశోభితంగా కొలువైన వేణుగోపాలుడ్ని భక్తులు దర్శించుకున్నారు. రథానికి సంప్రదాయంగా పూజలు చేశారు. భక్తులకు శీతల పానీయాలు, మజ్జిగ, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఉభయకర్తలుగా రాఘవరావు దంపతులు వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పుష్పక విమాన అలంకారంలో స్వామి వారు రాత్రి దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వెంకటరాజు, సునీత దంపతులు, శశాంక్‌దత్ వ్యవహరించారు. ఈఓ చంద్రశేఖర్, వ్యవస్థాపక ధర్మకర్త చంద్రమౌళీరెడ్డి పర్యవేక్షించారు.

రైతుల పంట పండింది

- 9,500 ఎకరాల్లో రబీ సాగు
- నాలుగున్నర నుంచి ఐదున్నర పుట్ల దిగుబడులు
- ఎన్నడూ లేని విధంగా మద్దతు ధరలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

రబీ సాగు ఎకరాల్లో

జిలకర మసూరి (బీపీటీ)	-6,200
షుగర్‌లెస్	-2,000
నెల్లూరు మసూరి	-1,300



బ్రహ్మదేవిలో నూర్పిళ్లు చేపడుతున్న వరికోత యంత్రం

ముత్తుకూరు: మండలంలోని రైతుల పంట పండింది. రబీ సీజన్ కింద చేపట్టిన వరి పంట దిగుబడులు రికార్డు స్థాయిలో రావడం..ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంబరపడిపోతున్నారు. గత నవంబరు, డిసెంబరు మాసాల్లో వచ్చిన అకాల వర్షాలకు చల్లిన విత్తనాలు, నారుమడులు నీట మునిగాయి. దీంతో రబీ సాగు ఆలస్యంగా మొదలైంది. ఈ పరిణామం ఎటువంటి అనర్థాలకు దారి తీస్తుందోనని రైతులు ఆందోళన చెందారు. దీనికి తోడు జనవరిలో కురిసిన మంచుతో వరి పైరుకు అగ్గితెగులు గండం ఏర్పడింది. అయితే తెగుళ్లు పంటకు ఎటువంటి నష్టాలను కలిగించలేదు. ఇటువంటి కష్టనష్టాల నుంచి బయటపడిన రైతులు వరి కోతలు ప్రారంభించారు. ఊహించిన విధంగా ఎకరాకు నాలుగున్నర నుంచి ఐదున్నర పుట్ల వరకు దిగుబడులు వచ్చాయి. దీనికి తోడు నాణ్యమైన ధాన్యం చేతికి అందడం రైతులను సంతోషంలో ముంచెత్తింది. రబీ సీజన్‌లో సాగునీటికి కొరత లేకపోవడం, రాజీ లేకుండా సేద్యం చేయడం ద్వారా దువ్వూరు వారిపాళెం, డమ్మాయపాళెం పంచాయతీల్లో జిలకర మసూరి రకం సాగుచేసిన రైతులు కొందరు ఎకరాకు 5 పుట్ల వరకు దిగుబడి సాధించారు. పొట్టెంపాడు పంచాయతీలో నాలుగున్నర పుట్ల వరకు దిగుబడి వచ్చింది. ఒక రైతు గరిష్టంగా ఐదున్నర పుట్ల దిగుబడి సాధించడం విశేషం. ఈ ఏడాది ధాన్యానికి మద్దతు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. పుట్టి ధాన్యం రూ.17,500 నుంచి రూ.18వేల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. డబ్బు అవసరమైన రైతులు ధాన్యం అమ్మకం చేస్తున్నారు. గిడ్డంగులు, వసతులు ఉన్న రైతులు ధాన్యం ఆరబెట్టుకుని, నిల్వ చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.



ముత్తుకూరు రిలయన్స్ రోడ్డుపై రైతులు ఆరబోసిన ధాన్యం

ఐదున్నర పుట్ల దిగుబడి వచ్చింది



రబీ సీజన్‌లో 12 ఎకరాల్లో బీపీటీ రకం వరి సాగు చేశా. ఎకరాకు సుమారు ఐదున్నర పుట్ల ధాన్యం దిగుబడి వచ్చింది. గ్రామానికి సమీపంలో సర్వేపల్లి రిజర్వాయర్ ఉండడం, సమృద్ధిగా సాగునీరు లభించడం, ప్రత్యేక శ్రద్ధతో సేద్యం చేయడంతో దిగుబడులు సాధ్యం అయ్యాయి.

–దివి సుబ్రహ్మణ్యం, రైతు, పొట్టెంపాడు

రైతులు సంతోషంగా ఉన్నారు



నాణ్యమైన వరి ధాన్యం, మంచి దిగుబడులు రావడం.. ధరలు బాగుండడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన, వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యవసాయ రంగంపై చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధతోనే ఇది సాధ్యమైంది. ధాన్యం నిల్వ చేసుకుంటే ఇంకా మంచి ధరలు లభించే అవకాశం ఉంది.

–పల్లంరెడ్డి జనార్ధన్‌రెడ్డి, రైతు, పొట్టెంపాడు

ప్రజాసంక్షేమమే ధ్యేయం



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కురిచెర్లపాడు, ఇస్లాంపేట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి మంత్రి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎవ్వరి ప్రమేయం లేకుండా సచివాలయాల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయడంతో పాటు నేరుగా ఖాతాల్లో నగదు జమచేస్తున్నారని తెలిపారు.

ఎన్నడూ లేనివిధంగా రైతులకు మద్దతు ధర

ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా ధాన్యానికి మద్దతు ధర లభిస్తుండడంతో రైతులు సంతోషంగా ఉన్నారని మంత్రి కాకాణి పేర్కొన్నారు. వర్షాలు సకాలంలో కురవడం, జలాశయాల్లో పుష్కలంగా నీరు ఉండడంతో రైతులు సాగునీటి ఇబ్బందులు లేకుండా పంటలు పండించుకున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యానికి గిట్టుబాటు ధరలు ఉండడంతో కోసిన ధాన్యాన్ని కోసినట్లు అమ్ముకుంటున్నారన్నారు. ధాన్యం ధరలపై రైతులు సంతోషంగా ఉండగా, గతంలో వ్యవసాయశాఖ మంత్రిగా వెలగబెట్టిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాత్రం చాలా అసంతృప్తిగా ఉన్నారని చెప్పారు. రైతులకు మద్దతు ధర లభించడం ఓర్వలేక ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. సోమిరెడ్డీ నీ హయాంలో ఏనాడైనా రైతుల సమస్యలు, రుణమాఫీ అంశాన్ని పట్టించుకున్నావా అని ప్రశ్నించారు. ఎంపీడీఓ సుస్మిత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి మందల వెంకటశేషయ్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్రకార్యదర్శి కోడూరు ప్రదీప్‌కుమార్ రెడ్డి, సర్పంచ్ అక్బర్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరమణయ్య, రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కమనీయం..సీతారాముల కల్యాణం



దంపూరులో సీతారాముల కల్యాణోత్సవం

కోవూరు:(విడవలూరు): దంపూరు మిక్సెడ్ కాలనీలోని రామమందిరంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు.అనంతరం గ్రామోత్సవం, అన్నదానం నిర్వహించారు. పెరమాళ్ల శ్రీనివాసులు, కడిమి ఫణికుమార్, గుట్టుపూడి హరిబాబు, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- ముదివర్తిలోని కరిమాణిక్యరాజస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవదేవేరులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

తోటపల్లిగూడూరు: మండలంలోని చింతోపు పంచాయతీలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్ శుక్రవారం తెలిపారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

కొత్తూరులో ఎమ్మెల్యే ప్రసన్న..

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరులో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి శుక్రవారం తెలిపారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



కొడవలూరులో గుడ్‌ఫ్రైడే సందేశాన్ని అందజేస్తున్న దైవసందేశకులు



రేబాలలోని రక్షణసైన్యం చర్చిలో దైవసందేశాన్ని అందజేస్తున్న పాస్టర్

కొడవలూరు: మండలంలోని క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నార్తురాజుపాళెంలోని సెంటినరి బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దైవసందేశకులు యేసు ప్రభువు శిలువపై పలికిన ఏడు మాటలను భక్తులకు వివరించారు. దేవప్రసాద్, సుందరం ఆర్కెస్ట్రా కళాకారులు భక్తిగీతాలను ఆలపించారు. చర్చి పాస్టర్ డాక్టర్ ఎం ప్రేమనాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చర్చి చైర్మన్, సెక్రటరీలు బట్టేపాటి సుదర్శనం, కోవూరు సురేష్, సండే స్కూల్ సూపరింటెండెంట్ బీ సుప్రియ, సభ్యులు తుమ్మలపెంట అహరోన్, బొచ్చు శ్రీనివాసులు, దేవసహాయం పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: మండల ప్రజలు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నగర పంచాయతీతో పాటు మండలంలోని రక్షణసైన్యం, పెంతుకోస్తు, బాప్టిస్టు, క్యాథలిక్ క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దాదాపు 40 రోజులు పాటు ఉపవాస దినాలను పాటించిన క్రైస్తవ సోదరులు ఉపవాసదీక్షను వీడి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దైవసందేశకులు శిలువపై యేసుక్రీస్తు పలికిన ఏడు మాటలను వివరించారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

- డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు

కొడవలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదల అభివృద్ధికి సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా వాటిని పారదర్శకంగా గడప గడపకు చేరవేస్తుండడంతో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల్లో అపూర్వ స్పందన లభిస్తోందని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు పేర్కొన్నారు. నార్తురాజుపాళెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చలపతిరావు పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో అపార విశ్వాసం ఉందన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి పేదకుటుంబాన్ని బిడ్డగా ఆదుకుంటున్నారని ప్రజలు సంతోషంగా చెబుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో రూ.లక్షల కోట్లు నేతల జేబుల్లోకి వెళితే, జగనన్న పాలనలో పేదల ఇళ్లకు చేరాయన్నారు. పేదలకు అండగా ఉంటున్న ముఖ్యమంత్రే రాష్ట్రానికి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. సర్పంచ్ బీ సుప్రియ, మండల సచివాలయాల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీతో పాటు మండలంలోని పదమూడు పంచాయతీల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరపంచాయతీలో కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గత ప్రభుత్వ పాలన, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలోని తేడాను తెలిపారు. ఐదు ప్రశ్నలతో కూడిన బుక్‌లెట్‌ను ప్రజలకు అందజేసి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. అనంతరం ప్రజల అనుమతితో ఇళ్లకు స్టిక్కర్లను అంటించడంతో పాటు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయానికి ఫోన్ ద్వారా మిస్డ్‌కాల్ చేయించారు. పార్టీ నాయకులు పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, కోడూరు మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ, కార్యకర్తలు ఆదిశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా డీసీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేసి కోవూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రతిఒక్కరూ కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, మండల సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు: నార్తురాజుపాళెంలో ఓ ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు



కోవూరులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

- విడవలూరు మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ముత్తుకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిగడపకు తీసుకెళ్లాలని మండల సచివాలయాల కన్వీనర్ నెల్లూరు శివప్రసాద్ గృహసారథులు, వలంటీర్లకు సూచించారు. మండలంలోని మునునూరువారిపాళెంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి మునుకూరు జనార్ధన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మునుకూరు బాబిరెడ్డి, తదితరులు గృహసారథులు, వలంటీర్లకు కిట్లను అందజేశారు. సచివాలయ కన్వీనర్ పఠాన్ సుభాన్‌బాషా, నాయకులు అశోక్‌గౌడ్, మునుకూరు సుధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని చూరగొన్న సీఎం జగన్

మనుబోలు: నాలుగేళ్ల పాలనలో ఇచ్చిన హామీల అన్నింటిని నెరవేర్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని చూరగొన్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మనుబోలులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అలాగే కట్టువపల్లి, కొలనకుదురు, జట్లకొండూరు గ్రామాల్లో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. పార్టీ నాయకులు బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కోసూరు కోటేశ్వరగౌడ్, గుంజి రమేష్, ఆవుల తులసీరాం, రాజారెడ్డి, సచివాలయ కన్వీనర్లు నాగమణి, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు : మండలంలోని సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మండల సచివాలయ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ప్రారంభించారు. పొదలకూరులోని శ్రీహరికాలనీ, శింగయ్యచేను, కాకాణి రమణారెడ్డి కాలనీ, తదితర ప్రాంతాల్లో సచివాలయ కన్వీనర్లు వాకాటి శివప్రసాద్‌రెడ్డి, సురేఖ, ఖాదర్, ఎస్కే అంజాద్, తదితరులు గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. గృహస్తుల అనుమతితో ఇళ్ల తలుపులపై స్టిక్కర్లను అంటించారు. సంక్షేమ పథకాలపై సంతృప్తిగా ఉన్నామని చాలా కుటుంబాల వారు మిస్డ్‌కాల్ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు. అలాగే తాటిపర్తి మేజర్ పంచాయతీలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు మా భవిష్యత్ నువ్వే జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపసర్పంచ్ పాములూరు లచ్చారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీహరి, సచివాలయ కన్వీనర్ ఆర్ చెంచురామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

తోటపల్లిగూడూరు: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో మండల సచివాలయాల కన్వీనర్ తలమంచి సురేంద్రబాబు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోడూరు పంచాయతీలో పార్టీ మండల నాయకుడు కావలిరెడ్డి రంగారెడ్డి, తోటపల్లిగూడూరులో నెల్లూరు ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, దువ్వూరు శ్రీనివాసులరెడ్డి, ఆగాల శ్రీనివాసులరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మన్నెం చిరంజీవులగౌడ్, అన్నం హరిప్రసాద్, పాకం ప్రవీణ్‌కుమార్, శీనయ్య, తదితరులు పాల్గొన్నారు.



మనుబోలులో..



పొదలకూరు: కాకాణినగర్లో ..



బుచ్చిరెడ్డిపాళెంలోని 13వ వార్డులో..




టీపీగూడూరు: కోడూరులో..



ముత్తుకూరు: గృహసారథులకు కిట్ల పంపిణీ

ప్రాథమిక చికిత్సపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఓఓ సంజయ్ కొత్త

ముత్తుకూరు: ప్రాథమిక చికిత్సపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాథమిక చికిత్స ఎంతో ఉపకరిస్తుందని ఆదాని కృష్ణపట్నం పోర్టు సీఓఓ సంజయ్ కొత్త పేర్కొన్నారు. శుక్రవారం పోర్టులో లాజిస్టిక్ ఉద్యోగులు, కార్మికులకు ప్రాథమిక చికిత్సపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఓఓ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రమాద బాధితులకు ప్రాథమిక చికిత్స అందించే సమయంలో వ్యక్తిగత భద్రత పాటించాలన్నారు. నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బీ కృష్ణమూర్తి ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించారు. పోర్టు సేఫ్టీ హెడ్ రామకృష్ణ మనీష్‌దేవ్, ఓంకార్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

యాళి వాహనంపై ఆంజనేయుడు



నెల్లూరు(బృందావనం): సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో వసంతోత్సవం, యాళి వాహనసేవను నిర్వహించారు. ఈఓ దర్గయ్య, మహేష్ పర్యవేక్షించారు.